# దేవుడి కథ

"మరో పది నిముషాలు పోతే పన్నెండవుతుంది" అన్నాడు నీలకంఠం నాలుగో గ్లాసులో షాంపేన్ పోయడం పూర్తిచేసి.

నీలకంఠం కంఠం పాత గ్రాంఫోనుమీదకీ ఇవ్వకుండా రికార్డు వేసినట్టుంది. అతని బుర్రలో ఎప్పుడూ డబ్బుగురించీ, విలాసాలగురించీ కలిపి ఆలోచనుంటుంది. అతని మెళ్ళో పులిగోరూ, మూతిమీద కేడ్ బరీస్ చాక్లేటు దళాన మీసాలు, ఎప్పుడూ చేతిలో గోల్డుప్లేకు సిగరెట్టు, కళ్ళలో క్రౌర్యం సాధారణంగా వుంటాయి. నీలకంఠాని కావూళ్ళో రెండు పెద్ద ఫ్యాన్సీషాపులు వున్నాయి.

ఆ హాల్లో నీలకంఠంతోపాటు మరో ముగ్గురు - శ్రీనివాసులూ, భానుమూర్తీ, విశ్వసుందరం మూడు సోఫాల్లాంటి కుర్చీల్లో కూర్చొన్నారు.

శ్రీనివాసులు ఎక్సెమ్మెల్యే. వెలుగులోనూ, చీకట్లోనూకూడా, బాగా డబ్బుంది. అతని కా యేడెలక్షన్లు జ్ఞాపకమొచ్చినప్పుడల్లా తనోడించిన "కామరాజు"నీ, అతని కోటేసినవాళ్ళనీ సున్నితంగా బూతులు తిడుతుంటాడు.

భానుమూర్తిది పెద్ద వ్యాపారం. హోల్‌సేల్ మీద బట్టల్నీ, వేరేచోట పేపర్నీ, మరోచోట అమ్మాయిల్నీ విక్రయిస్తూంటాడు.

విశ్వసుందరం మరో వూర్లో కమీషనర్‌గా పన్చేసేవాడు. చాలా వేల రూపాయలు జాగ్రత్తగా ఆర్జించాడు. ఐనా, హయ్యరధారిటీసింకా జాగ్రత్తగా పరిశీలించి, ఇతన్ని వుద్యోగంలోంచి తీసేసేలోపునే రాజీనామా ఇచ్చేసి ఆ వూరొచ్చేశాడు. ఇప్పుడతను టోకున (గమ్)మ్మత్తు వ్యాపారంచేస్తూ ఆర్జిస్తూనేవున్నాడు.......

నలుగురూ షాంపేన్ సగానికి తాగారు.

ఇంతలో విశ్వసుందరం ఏదో జ్ఞాపకం వొచ్చినవాళ్ళాగ డ్రాయర్‌లోంచి పేకతీసి నలుగురికీ ముక్కలు పంచాడు. నలుగురూ ముక్కలెత్తారు.

గోడగడియారం పన్నెండు కొట్టింది.

నలుగురూ ఒకేమారు వాచీలు చూస్కొని మళ్ళీ ముక్కలవైపు చూశారు.

టక్.... టక్.... టక్....

ఎవరో తలుపుకొడుతున్నారు.

"ఎవరు?" అన్నాడు శ్రీనివాసులు.

"జగ్గరాజై వుంటాడు" అన్నాడు భానుమూర్తి.

నీలకంఠం వెళ్ళి తలుపు తీశాడు.

మిగతా ముగ్గురూ తలుపుకేసి చూశారు....

ఆ వచ్చిన వ్యక్తి జగ్గరాజై లేదు....

అతను లోపలికి వచ్చి తలుపు మూసి వెనక్కి తిరిగాడు....

"ఎవరు మీరు?" అనడిగాడు నీలకంఠం.

అతను చిన్నగా నవ్వాడు.... నలుగురూ కూర్చొన్న టేబుల్ దగ్గరగా వచ్చాడు.... ఇంకా నవ్వుతూనే వున్నాడు.

నీలకంఠం వచ్చి తన సీట్లో కూర్చొన్నాడు.

"ఎవరు నువ్వు?" అని వీలయినంత గంభీరంగా అడిగాడు నీలకంఠం. ఎదురుగావున్న కుర్రాణ్ణిచూస్తుంటే అతనికి మర్యాదివ్వవలసిన అవసరం కనిపించలేదతనికి.

ఆ వచ్చినతనికి పాతిక్కీ ముప్పైకీ మధ్యనుండొచ్చు వయసు. బాగా విశాలమైన నుదురూ, పైకి దువ్విన నల్లటి జుత్తూ నవ్వినప్పుడు చిన్నవయ్యేకళ్లూ.... అతన్నిచూస్తే ఎవరికైనా మంచి అభిప్రాయం పుట్టటానికే ఎక్కువ అవకాశాలున్నాయి.

అతను నవ్వుతూ అన్నాడు: "నేన్చెప్పినా మీరు నమ్మరు...." అలా అని ఓ అరనిమిషం ఆగాడు. గదిలో షాంపేను వాసనా, గడియారం చేస్తున్న ధ్వనీ, ఊపిర్ల చప్పుడూ స్పష్టంగా వున్నాయి....

"నేను దేవుణ్ని" అన్నాడతను.

నలుగురూ ఒకేమారు కోరస్‌లో "ఆఁ!" అన్నారు.

"నీలకంఠం! మెంటల్ హాస్పిటల్లో ఎవడైనా పేషంటు మిస్స య్యాడేమో కనుక్కో!" అన్నాడు విశ్వసుందరం.

మిగతా ముగ్గురూ ఫెళ్ళున్నవ్వారు. అలా సుందరం జోకులకి నవ్వకపోతే "అల్కహాలు" ఫ్రీగా దొరకదని వాళ్ళ భయం.

"మీరలానే అంటారని నాకు తెలుసు.... ఐతే నేను చెప్పింది నిజం. మీరు నన్ను నమ్మకపోయినా భయంలేదు.... మిమ్మల్ని నమ్మించ గలను....

మీరంతా రాత్రి పడుకోబోయే ముందూ, ఉదయం నిద్రలేచాకా నన్నో అర నిమిషం ప్రార్థిస్తూంటారు....

నీలకంఠం! నిన్న నువ్వు ఇన్‌కమ్‌టాక్సాఫీసరుకి రెండువేలు చదివించావ్.

విశ్వసుందరం.... రెండ్రోజులకితం నువ్వు షిప్పుకిచ్చిన ఖరీదైన సరుకులో ఒక గాలను నాటుసారా కలిపావు.... భానుమూర్తీ నువ్వు....

"ఆపాపు! నువ్వు దేవాంతకుళ్ళా వున్నావ్!" అన్నాడు భాను మూర్తి కంగారుగా.

ఆగంతకుడు మళ్ళీ నవ్వాడు. "పైకి మీ రిలాటిపనులుచేసినా మీరంటే నాకిష్టం. మీ హృదయాల్లో కల్మషంలేదు. నామీద మీకు నమ్మకముంది. అందుకే నిరంతరం మిమ్మల్ని నే కాపాడుతున్నా...." అన్నాడు.

"మేం నమ్మం! ఈ కలియుగంలో దేవుడేమిటి? ఇలా ఓ సామాన్యుడి రూపంలో రావడమేమిటి? రాట్! బాషెండ్ బంకమ్!" అన్నాడు నీలకంఠం....

"నీ బుర్ర అలా పన్జేస్తుందని నాకు తెలుసు. సామాన్య మానవుడి రూపం కాకుంటె భూలోకానికి నా రూపంతో రమ్మన్నావా? పిచ్చివాడా.... అసలు నువ్వే నేను. నేనే నువ్వు...." అని దేవుడు పక్కగానున్న మరో కుర్చీ టేబుల్ దగ్గరగా లాక్కొని కూర్చున్నాడు.

"యేమిటో ఇదంతా పెద్ద మిస్టరీలాగుంది" అన్నాడు భానుమూర్తి. అలా అని గ్లాసులో మిగిలిన షాంపేను గడగడా తాగేశాడు.

"సరే! నువ్వు దేముడివే అనుకొందాం. ఇప్పుడు మాదగ్గరికి ఎందుకొచ్చినట్టు?" భానుమూర్తి మాట్లాడుతూంటే నోట్లోంచి షాంపేను తుంపరలు ఎగిరాయి. అదేదో ఉత్సవంలో ఎత్తుగావున్న విగ్రహం మీదకి కొబ్బరికాయలూ, అరటిపళ్లూ ఎగిరినట్లు.

"చెప్తాను." అన్నాడు దేవుడు. టేబిల్ మీదగా వొంగి ఓ సిగరెట్టు పాకెట్టులో సిగరెట్టు తీస్కొన్నాడు. స్పేర్‌గావున్న గ్లాసులో షాంపేనుపోసి ఒకమారు సిప్‌చేసి సిగరెట్టు ముట్టించాడు. మళ్ళీ షాంపేను గ్లాసు నోటిదగ్గర పెట్టుకున్నాడు.

"గుడ్ హెవెన్స్! దేముడూ సిగరెట్టు కాల్చి, షాంపేనూ గట్రా తాగుతాడన్నమాట" అన్నాడు సుందరం కుర్చీలోంచి ఓ అంగుళం పైకి లేచి.

షాంపేన్ గ్లాసులోంచి దేవుడు చిరునవ్వు పచ్చని నైలాన్ పైట లోంచి ఎర్రని శాటిన్ జాకెట్టులా మెరిసింది.

"ఔను. నేనిరవయ్యో శతాబ్దంవాణ్ణి. అదికాక మీ దగ్గరికి మనిషి రూపంలో వచ్చాను. ఇంకా వినండి. లోకంలో అన్యాయం, అధర్మం పేట్రేగిపోయిందంటున్నారంతా. ఎంతోమంది తిండీలేకా, ఇంకా ఎన్నో లేక నన్ను తిడుతూ, తిట్టుకొంటూ చచ్చిపోతున్నారు. బతికున్నవాళ్ళు నన్నే తిడుతున్నారు. శపిస్తున్నారు. నా మీద కవిత్వాలు రాస్తున్నారు. వాట్లో తిడుతూ పొగుడుతున్నారు, పొగుడుతూ అరుస్తున్నారు.

ఇంకా చాలామంది నన్నో కమీషన్ యేజంటులా చూస్తున్నారు. అంతెందుకు.... శ్రీనివాసులు ఎలక్షన్లో గెలిస్తే నన్ను కొబ్బరికాయల్లో ముంచెత్తుతానన్నాడు. గెల్చిన తర్వాత తలిస్తానని, అప్పటికి రోజుకో అరటిపండు నైవేద్యం పెట్టేవాడు.... ఎలక్షను రోజుల్లో నన్ను మరచి పోయాడు. మిగతా వాళ్ళకోసం డ్రమ్ములకొద్దీ సారా ఒంపాడు. కట్టల కొద్దీ నోట్లు విరజిమ్మాడు" ఐనా అత నెలక్షను పోయింది. అలా అవ గానే నన్ను తిట్టాడు.... తాగినప్పుడు మరీ ఘోరంగా శపించాడు. హోటలు కెళ్ళినా, కొబ్బరి చెట్నీ తినేవాడుకాదు. ఆ చెట్నీ కోవెలనించి కొన్న కాయల్తో చేసిందేమోనని....

ఆ ఎలక్షన్ మూడ్ పోయాక మళ్ళీ నన్ను క్షమించమన్నాడు. ఇంకా యేవో కోరికలు చెప్పి తీర్చమనేవాడు....

ఒక్క శ్రీనివాసులేకాదు అందరూ అంతే. చేతులారా అన్నీ చేస్కొని, యేం జరిగినా నన్నే బాధ్యుడిగా చూస్తారు....

"ఆగు! అయితే నా ఎలక్షనెందుకు పోయినట్టు?" అన్నాడు శ్రీనివాసులు.

"అది నువ్వు చేతులారా చేస్కొన్నదే! డబ్బును నీ పార్టీవాళ్ళ కిచ్చావుగాని, అది అందరికీ అందిందో లేదో.... నీ పార్టీవాళ్ళు ఎంత తినేశారో గమనించావూ? సారాక నీ వెనకతిరిగే వాళ్ళెంత పీల్చేశారో చూశావూ? బాధ్యతంతా వాళ్ళమీద పెట్టేశావు. అందుకే అట్లయింది.... మరో కారణంకూడా వుంది.... అది నీ ఖర్మ....!" దేవుడు చేతిలో సిగ రెట్టు పారేసి మరో సిగరెట్టు ముట్టించాడు.

"అలా అందరూ నన్నే తిడతారు. నన్నే ప్రార్థిస్తారు........ నా ముందే చేతులు జోడిస్తారు. నామీదే చేతులెత్తుతారు" కొందర్నిచంపే మంటారు. ఇంకొందర్ని బతికించమంటారు. నన్ను గొప్పవాడి వం టారు."

గడియారం చప్పుడు నిశ్శబ్దాన్ని కౌగలించుకుని యేడుస్తోంది.

షాంపేన్‌వాసన గదిలోపలే చుట్టూ పరిగెడుతోంది.... నలుగురు పెద్దమనుషుల బుర్రల్లోనూ రాకెట్లెగురుతున్నాయి.

"నే నిదంతా నమ్మలేకపోతున్నాను. నువ్వెవడవో మోసగాళ్ళా గున్నావు. మమ్మల్ని దగాచేసి...." నీలకంఠం ఆగాడు. అతని గొంతుక మత్తులో తేలినట్టు తుళ్ళుతోంది.

"ఉండు; నన్ను మోసగాడివంటున్నావు. నువ్వూ, భానుమూర్తీ కలిసి సుందరాన్నీ, శ్రీనివాసుల్నీ "మిషన్" సంగతి తెలీకుండా మోసం చేయటంలేదూ?" అన్నాడు దేవుడు.

"మిషనా? ఏం మిషను!" అన్నారు నీలకంఠం కళ్ళూ, భాను మూర్తి నోరూ బాగా తెరిచేసి.

"అదే; వందరూపాయల నోట్లచ్చుకొట్టే మిషన్" అన్నాడు దేవుడు.

"అబద్ధం! పచ్చి అబద్ధం!" అరిచాడు భానుమూర్తి.

శ్రీనివాసులూ, సుందరం అతనివైపు ఓరగా, కోపంగాచూశారు.

"ఆగు! అతన్ని చెప్పనీ" అన్నాడు సుందరం.

"సుందరం వీణ్ణి నమ్మకు. వీడు లుచ్చాకోర్. మనలో స్ప్లిట్స్ పెడదామని చూస్తున్నాడు" అన్నాడు నీలకంఠం....

"అరవకు" అన్నాడు దేవుడు. "నువ్వుచేస్తున్నది తప్పని నేనన్ను. మీ నలుగురూ, మిగతావాళ్లూ, ఆడా, మగా, అంతా అందరూ డబ్బుకోసం వెధవపన్లే చేస్తున్నారు. మీరు చేస్తున్నది ఇంకా తక్కువే....

దేవుడు కుర్చీలోంచి లేచాడు.

"నీలకంఠం డబ్బు నచ్చుకొట్టి మీకు చెప్పలేదని అరుస్తున్నారు. సుందరం నువ్వు పక్షవాతపు అమ్మాయిని ఎందుకు పెళ్ళిచేసుక్కున్నదీ నాకు తెలుసు.... ఈ మధ్యనే, ఎన్ని స్లీపింగ్ డోస్ టాబ్లెట్లు ఎక్కడ కొన్నావో తెలుసు. వాట్నేంచేశావో తెలుసు. నీ పెళ్ళాన్ది ఆత్మహత్య న్చెప్పి, ప్రూవు చేయించడానికి, సబ్బినస్పెక్టర్నించి, డీయస్పీదాకా ఎంత లంచమిచ్చావో తెలుసు.

శ్రీనివాసులూ.... నువ్వెమ్మెల్యేగా వున్నప్పుడు సిటీ డెవలప్ మెంటుకని గ్రాంటు చేయించిన పాతిక లక్షల్లోనూ, సిటీని ఎంతగా,

ఎంతలో డెవలప్ చేయించావో నేనెరుగుదును. ఎన్జీవోల్ని వసూలుచేయించిన డబ్బులో ఎంత దేశంకోసం వుపయోగించావో నాకు తెలుసు.

ఇలా చెప్పుకుంటూ పోతే మీరు చేసినపన్లకి ఈ శతాబ్దం, నానోరూ ఇవేవీ చాలవ్....

"ఆగు!సుందరం!వీణ్ణి పోనిస్తే లాభంలేదు.ఆ డ్రాయరులో సైలన్సరుంది. తియ్!" అన్నాడు నీలకంఠం ....

"పూర్ ఫెలోస్" నన్నప్పుడే శత్రువుకింద భావిస్తున్నారా? నే చెప్పేది పూర్తిగా వినండి.... నేను మీరుచేసినవి చెప్పానే కాని, మిమ్మల్ని దండిస్తాననలేదే.... మీరు చేసినది మీ కోసమే చేస్కున్నారు. అది తప్పని నేననలేదు...." అని దేవుడింకా యేదో అనబోతుండగా.

"నువ్వు చెప్పేదేమిటి?.... దేవుడట, దేవుడు! బాస్టర్డ్! మమ్మల్నే మోసంచేదామనుకున్నావా!" అన్నాడు భానుమూర్తి.

"లేదు" మిమ్మల్ని మోసం చెయ్యాలని రాలేదు. నా చెడ్డపేరు పోగొట్టుకుందామని వచ్చాను. ఈ ఊర్లో మిమ్మల్ని ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. మీరు తెలివైన వాళ్ళు! నే చెప్పిన కార్యాన్ని సాధిస్తారని నమ్మకంవుంది. మీరు నన్ను దేవుడంటే నమ్మలేదు కదూ, సరే ఇప్పుడు నమ్మిస్తాను విశ్వరూపం చూపిస్తాను" అంటూ దేవుడు షేంటు జేబులోంచి ఓ చిన్న వుండలాంటిది తీసి నేలకేసి కొట్టాడు.

కొద్ది నిముషాల్లోనే గదంతా పొగకమ్ముకుంది.
"ఫూల్! మత్తుమందు వదిలాడు."
"దొంగవెధవ."
"రాటెన్ స్కౌండ్."

ఇలాంటి మాటల్తోబాటు చిన్నవీ, పెద్దవీ, సున్నితమైనవీ, కఠినమైనవీ, బూతుమాటలు ఓ రెణ్ణిమిషాలు నలుగురి నోళ్ళల్లోంచి వినబడ్డాయి.

కాస్సేపట్లో అంతా మంచు కమ్మేసినట్లుగాపోయింది. ఎవరో గుండెల్ని పీకేసినట్టూ, గదంతా కెలికేసినట్టూ ఉంది. నక్షత్రాలూ, వాటి

చుట్టూ ఎగురుతున్న నోట్లకట్టలూ, షాంపేన్ గ్లాసులూ కనిపించాయి. ఓ ఐదు సెకండ్లయాక.... యేమీ కనిపించలేదు.

* * *

ఒకరి తర్వాత ఒకరు నలుగురూ కళ్ళు తెరిచారు. అప్పుడే గది లోకి పగటి వెలుగూ, నలుగురి బుర్రల్లోకి తెలివీ వచ్చేశాయి.

"నీలకంఠం! రాత్రి గొప్ప కలొచ్చిందోయ్? దేవుడు........ ఔనో కాదో తెలీదు. మీ ఇంటికొచ్చాట్ట. మనందరి సంగతీ చెప్పేశాడు. యేదో వుపదేశం చేశాడు." అన్నాడు భానుమూర్తి.

"ఛంపావ్ ఫో! నాకూ అదేకల!" అన్నాడుసుందరం....

"నాకూనూ!" అన్నాడు శ్రీనివాసులు కళ్ళు నులుపుకొంటూ.

"మీ మొఖాలు! అది కల కాదు నిజమే" అంటూ గది లోపలి గదిలోకివెళ్ళి రెజ్జిమిషాల్లో వచ్చేశాడు నీలకంఠం.

"ఐపోయింది. అంతా ఐపోయింది. వాడెవడో దొంగ వెధవ. ఇనప్పెట్టంతా ఖాళీచేసిపోయాడు." నీలకంఠం గుండెలూ, ఉండుండి తలా బాదుకుంటున్నాడు.

"పాతిక లక్షల నగలూ, పది లక్షల రొక్కం, బాబోయ్!" ఆర్నెల్ల కాపురంచేసి మొగుడు పోయింతర్వాత యేడ్చే అమ్మాయిలా యేడుస్తున్నాడు నీలకంఠం.

మిగతా ముగ్గురూ లేచారు. ఒకరి ప్రక్క ఒకరు గాభరాగా, అనుమానంగా, అంతలోనే కోపంగా చూస్తున్నారు.

"అదేదో కాగితం టేబిల్‌మీదుంది" అంటూ కాగితాన్ని తీశాడు సుందరం.

"ఓర్నో! నీలకంఠం దగ్గర నావో ఐదు లక్షల నగలు దాచాను" అన్నాడు కొంచెం తక్కువగా యేడుస్తూ, శ్రీనివాసులు.

"ఆగండి; ఇదేదో వుత్తరం. చదువుతాను." చదవడం మొదలెట్టాడు సుందరం.

"మీరంతా ఒట్టి వెధవలు".... అని చదివి "ఆ" అని తుళ్ళి పడ్డాడు సుందరం. "దొంగ వెధవ.... లం........"

"ఆగకు. అంతా చదివేద్దూ; తరువాత తిట్టొచ్చు అన్నాడు భానుమూర్తి"

"నేను దేవుణ్ణిగాదు. మామూలు మనిషినే.... కానీ మీలాటి మనిషినికాదు. మీకన్నా తెలివైన వాణ్ణి.... రాత్రి మీ దగ్గర చేష్టలకు ఆశ్చర్యపోతారని నాకు తెలుసు. ఆ వివరాలన్నీ జాగ్రత్తగా సేకరించే మీ ఆతిథ్యానికి వచ్చాను.

మీ నలుగురూ, తెలివైనవాళ్లే........ పంచి వాళ్ళ రక్తాన్నెలా పీల్చాలో, దాన్ని డబ్బుక్రింద ఎలా కన్‌వర్టు చేస్కోవాలో మీకు బాగా తెలుసు. ఒకడు తిండిలేక రోడ్డుమీదపడి యేడుస్తుంటే, వాడికాలు మీంచి కారుచక్రం తీసుకుపోవడం తెలుసు.

చచ్చిపోయిన కొడుకుశవం కాల్చడానికి డబ్బుల్లేక, ఓ బీదతల్లి యేడుస్తూంటే కార్లోంచే, కాల్చేసిన సిగరెట్టు నామెపైకి విసరడం, మీకందరికీ తెలుసు.

చదువులున్నా ఉద్యోగంలేక, ఉద్యోగమిప్పించమని కాళ్ళమీద పడితే, డబ్బు తెమ్మని, ఆ అమాయికపు నిరుద్యోగి, రక్తాన్ని గుండెల్ని తాకట్టుపెట్టి డబ్బు తెస్తే, దాన్ని తీస్కొని, మీ బంధువుల కుద్యోగమిప్పించి, ఎక్కువ డబ్బిచ్చినవాడికి అవకాశాలు కల్పించడం మీకందరకీ బాగా తెలుసు.

అమాయకుల గొంతుకలు కోయడం, నమ్మినవాళ్ళని నాశనం చేయడం. పేదవాళ్ళని నల్లుల్లా నలపడంలో మీరంతా ఆరితేరినవాళ్ళు.

అలాటి మీ ఆతిధ్యం నిన్న రాత్రి పొందడం నాకు అవమానకరమే. కాని కొంతలో కొంత సంతోషం....ఇనప్పెట్టినీ, మీ జేబుల్నీ ఖాళీ చేసి పట్టి కెళ్ళడం.

మీరుచేసిన, చేస్తున్న ద్రోహాలకీ అన్యాయాలకి సాక్ష్యాలు నా దగ్గరున్నాయి.

వచ్చే నెలలోనే, ఈ వూరికి వో స్పెషలాఫీసరొస్తున్నాడు. మీరు తాగిన రక్తాన్ని కక్కిస్తాడు. పిచ్చి వేషాలేస్తే, నిలువునా నాశనం చేస్తాడు.

ఇవాళే అతనికి మీ మీదా, మీ లాంటి వాళ్ళమీద రిపోర్టు పంపు తున్నాను. ఇంకా పూర్తిగా న్యాయంచావని మనసులున్న కొద్దిమందికీ కాపీలందచేస్తున్నాను.

ఇప్పటికైనా బుద్ధితెచ్చుకుని బతకండి.... మీరు తిని పేద వాళ్ళ కింత పెట్టండి.

మీరలా చేయకపోయినా భయంలేదు.

కాలం, స్పెషలాఫీసరూ మీచేత అలా చేయిస్తారు....!

ఏమైనా రాత్రి మీ ఆతిధ్యానికి నా థాంక్స్.

ఈ కలలాంటి కథని డైరీల్లో రాస్కొని రోజూ చదవండి....

"దేవుడి కథ అని నామకరణం చేయండి....

మనుషుల్లా బతకడానికి ప్రయత్నించండి.

మీ పాలిట
దేవుడు ....

ఉత్తరం చదివి సుందరం కూలిపోయాడు.

ఎవరి నోట్లోంచీ తిట్లూ, ముక్కులోంచి సరైన ఊపిరి కూడా రాలేదు.

శ్రీనివాసులూ, నీలకంఠం, భానుమూర్తి అలానే నేలమీదకు వాలిపోయారు.

సుందరంచేతిలో కాగితం ఫానుగాలికి పైకిలేచి షాంపేన్ వది లేసిన స్మృతి లాటి వాసనలా మత్తుగా ఎగురుతోంది.